## క్లుప్తంగా

### ఉచిత మెగా వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కాట్రేనికోన: ఎస్‌బీఐ కాట్రేనికోన శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు బ్రాంచి వద్ద ఖాతాదారులకు మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మెడ్ యునైటెడ్ ఆస్పత్రి వైద్యులు ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని బ్యాంకు బ్రాంచి మేనేజర్ వెంకటేష్ ప్రారంభించారు. న్యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ, గైనిక్, జనరల్ విభాగాల వైద్యులు రోగులను పరీక్షించి, మందులు ఉచితంగా అందజేశారు.

### నేడు వైఎస్సార్ ఆసరా రుణమాఫీ పంపిణీ

అమలాపురం టౌన్: పట్టణ పరిధిలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత ద్వారా విడుదలైన రుణ మాఫీ సొమ్మును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పంపిణీ చేస్తారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. స్థానిక బాలయోగి స్టేడియంలో బుధవారం ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

### బూత్ స్థాయిలో నియామకాలు చేయాలి

మంత్రి కార్యాలయం నుంచి నిర్దేశం

అమలాపురం టౌన్: అమలాపురం నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ బూత్‌లకు సంబంధించి బూత్ స్థాయిలో పార్టీ తరఫున ఒక అధ్యక్షుడు, ముగ్గురు ఉపాధ్యక్షులను నియమించాలని పార్టీ శ్రేణులకు మంత్రి పినిపే విశ్వరూప్ క్యాంపు కార్యాలయం నిర్దేశించింది. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదీ లోపు ఈ నియామక ప్రక్రియను పూర్తి చేయాలని నియోజకవర్గ పట్టణ, మండలాల అధ్యక్షులకు మంగళవారం సూచించింది. పట్టణ, మండల అధ్యక్షులతో పాటు, జేసీఎస్ మండల అధ్యక్షులు ఈ నియామకాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, గడువులోగా పూర్తి చేయాలని పేర్కొంది.

### ఘనంగా రుద్ర హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన రుద్రహోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం ఘనంగా జరిగింది. పరమ శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని ఆలయంలో మంగళవారం అర్చక స్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులు స్వామివారికి గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### పదిలో మంచి ఫలితాలు సాధించాలి



భీమనపల్లిలో స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం: విద్యార్థులు రానున్న రోజుల్లో జరిగే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని భీమనపల్లి సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు అన్నారు. మండలంలోని భీమనపల్లిలో శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం ఆయన అందించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించాలని 108 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను అందించినట్టు హెచ్‌ఎం నూకల సత్యనారాయణ తెలిపారు.

### తుప్పలతో తిప్పలు



తుప్పలు నిండిన గొల్లవిల్లి-సన్నవిల్లి కాలువ గట్టు ప్రాంతం

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి-సన్నవిల్లి కాలువ గట్టు మార్గంలో రహదారులు తుప్పలతో నిండిపోయాయి. అటుగా ప్రయాణించే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారికిరువైపులా పెరిగిన తుప్పలు ప్రయాణికులను గాయలపాలు చేస్తున్నాయి. అధికారులు స్పందించి, తుప్పలు తొలగించి, రహదారి ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

# డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేశాం

- నవరత్నాల పథకాలు99 శాతం అమలు
- రూ.2 లక్షల 50 వేల కోట్ల నిధులు మహిళల ఖాతాల్లోకి జమ
- మంత్రి పినిపే విశ్వరూప్
- వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీలు

అల్లవరం: డ్వాక్రా సంఘాల రుణాలను పూర్తి స్థాయిలో మాఫీ చేస్తామని ప్రజా సంకల్పయాత్రలో మహిళలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక నిలుపుకొన్నారని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. నాలుగు విడతల్లో రుణాలను పూర్తి స్థాయిలో మాఫీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని చెప్పారు. వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమంలో భాగంగా గుడ్డివానిచింత వద్ద చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. డ్వాక్రా సంఘాల రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తానని ఆనాడు చెప్పినట్లే నేడు పూర్తి స్థాయి రుణమాఫీ చేశారని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. టీడీపీ హయాంలో చంద్రబాబు డ్వాక్రా సంఘాలను నిలువునా ముంచాడని మంత్రి అన్నారు. గత ప్రభుత్వంలో ఏ హామీ కూడా అమలు చేయకుండానే, మాయమాటలతో మహిళలను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చే వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని మంత్రి విశ్వరూప్ హితవు పలికారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 79 లక్షల మందికి డ్వాక్రా రుణమాఫీ జరిగిందన్నారు. 65 లక్షల మందికి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున పెన్షన్ అందజేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వివిధ పథకాల ద్వారా రూ.2 లక్షల 50 వేల కోట్ల నిధులను డీబీటీ ద్వారా బ్యాంక్ ఖాతాలకు జమ చేశామన్నారు.

**రుణ విముక్తులైన మహిళలు**

డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేసి ప్రతి మహిళను రుణ విముక్తులను చేశారని ఎంపీ అనురాధ తెలిపారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూర్చారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల తమ కుటుంబాలకు మంచి జరిగితే వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. జగన్ ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతాయని ఎంపీ అన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణ మాట్లాడుతూ తమ పిల్లలు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారంటే సీఎం జగన్ వల్లేనని గుర్తుంచుకోవాలన్నారు. పిల్లలు ఉన్నత చదువులు చదవాలంటే జగన్ వల్లే సాధ్యమని తెలిపారు. అనంతరం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుని డ్వాక్రా మహిళలకు మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీలు ఇజ్రాయిల్, సూర్యనారాయణ అందించారు. దృశ్యకళల అకాడమీ చైర్మన్ కుడుపూడి సత్యశైలజ, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పార్టీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరికల శ్రీను, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ ఎస్.మౌనిక, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్, ఏపీఎం సయ్యద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### ముమ్మిడివరం ఎస్సైగా సురేష్‌బాబు



ముమ్మిడివరం: కొత్త ముమ్మిడివరం ఎస్సైగా డి.సురేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రామచంద్రపురం ఎస్సైగా పని చేస్తూ, బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎస్.శివప్రసాద్ అమలాపురం ఎస్పీ ఆఫీసుకు బదిలీపై వెళ్లారు.

### మహా శివునికి ప్రత్యేక పూజలు



భీమనపల్లిలో ప్రత్యేక అలంకరణలో అనంగేశ్వరస్వామి

ఉప్పలగుప్తం: భీమనపల్లి గ్రామంలో అనంగేశ్వర స్వామివారి దేవస్థానంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కె.కార్తీక, వరదా శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు వెలువలపల్లి వెంకటసూర్య సత్యనారాయణ శర్మ ఉదయం నుంచి గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, మహాశివునికి రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలకరించి, అన్న సమారాధన చేశారు.

## ఆత్మ గౌరవ గొడుగు గిడుగు



గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఐ.పోలవరం: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి 84వ వర్ధంతి సందర్భంగా మురమళ్లలో మంగళవారం భాషా సంస్కృతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పీటీఎం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సాహితీ కార్యక్రమానికి సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి నడిపిన ఉద్యమానికి పండితులు, ఛాందసవాదులు అడుగడుగునా అడ్డుకునేవారన్నారు. గిడుగు భాషా వేత్త మాత్రమే కాదని, ఆయన ఆత్మ గౌరవ గొడుగు అని కొనియాడారు. ప్రజా కవిత్వం జాతీయాలు అనే అంశంపై తెలుగు పండితురాలు అన్నపంతుల యామిని ప్రసంగిస్తూ.. నేటితరం సామాన్యులు సైతం కవిత్వాన్ని ఆస్వాదిస్తున్నారన్నారు. అనంతరం జరిగిన గాన విభావరిలో, కవి సమ్మేళనంలో పాల్గొన్న వారికి ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు జి.వెంకట్రాజు, సత్తిబాబు, పీవీ రావు, విత్తనాల ప్రసాద్, దొమ్మేటి సత్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- మూడు ట్యాంకులు ప్రారంభం



చింతాకులవారిపేటలో తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టినట్టు టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం సుంకరపాలెం పంచాయతీలోని చింతాకులవారిపేట, బాబానగర్, నీలపల్లి పంచాయతీలోని మోకావారిపేటలో రూ.కోటి ఐదు లక్షల ఓఎన్‌జీసీ సీఎస్సార్ నిధులతో నిర్మించిన తాగునీటి ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాళ్లరేవు మండలంలో ఐదు ట్యాంకులైనా నిర్మించారా అని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లలో ఒక్క తాళ్లరేవు మండలంలో 25 ట్యాంకులను నిర్మించామని, ముమ్మిడివరం నియోజకవర్గంలో 90కి పైగా ట్యాంకుల నిర్మాణం చేపట్టి, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక లబ్ధి చేకూరిందన్నారు.

రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం సర్పంచ్ టెక్కపూడి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, రెడ్డి సతీష్, రేవు మల్లీశ్వరి, మోకా మధుబాబు, కాశి లక్ష్మణస్వామి, గుత్తుల శ్రీను, బొంతు సత్యనారాయణ, బొంతు శ్రీనివాసరావు, చింతాకుల రాంబాబు, చీకట్ల మోహన్, వడ్డి ఏడుకొండలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మారుతీరావు, కార్యదర్శి జ్యోతి సుధ, వరలక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చురుగ్గా కుల గణన సర్వే



అమలాపురంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు నుంచి వివరాలు సేకరిస్తున్న సర్వే సిబ్బంది

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వే అమలాపురం పట్టణంలోని 15 వార్డు సచివాలయాల్లో చురుగ్గా సాగుతోంది. సర్వే సిబ్బంది స్థానిక సూర్యనగర్‌లోని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఇంటికి వెళ్లి, ఆయన నుంచి సమాచారం సేకరించారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఈ సర్వే నివేదికలపై రోజు వారీ వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో సమీక్షిస్తున్నారు. పట్టణంలోని 17,213 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. ఆయా కుటుంబాలకు సంబంధించి 48,582 వ్యక్తుల వివరాలను సర్వే బృందం సేకరిస్తోంది. ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన ఇంటింటా సర్వే ఈ నెల 28లోపు పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వార్డు సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పూర్తిగా ఇందులో నిమగ్నమయ్యారు. అందుబాటులో లేని వారి కోసం ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి రెండులోపు సర్వే చేసేందుకు ప్రభుత్వం గడువు ఇచ్చిందని కమిషనర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ కుల గణన దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని పరిస్థితుల్లో.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతంగా ఈ సర్వేను చేయిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సర్వే వల్ల బీసీల గణాంకాల్లో పూర్తి స్పష్టత వచ్చి, రానున్న రోజుల్లో ఎన్నో ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉందన్నారు.

### వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ



శిబిరాన్ని పరిశీస్తున్న డీఎంహెచ్‌ఓ

అమలాపురం రూరల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొర రెడ్డిపల్లి సచివాలయం పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రిఫరల్స్, రక్త పరీక్షలు, నేత్ర వైద్య సేవలు, ప్రత్యేక వైద్య, ఆరోగ్యశ్రీ సేవలు తదితర వాటిని తెలుసుకుని సలహాలు ఇచ్చారు, ప్రతిఒక్కరూ ఈ శిబిరాలను ఉపయోగించుకోవాలని కోరారు. శిబిరంలో సర్పంచ్ కరాటం ప్రసన్న, డాక్టర్ స్వర్ణకమల తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పాలగుమ్మి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అమలాపురం రూరల్: పాలగుమ్మి జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1997–1998 టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ఆనాటి గురువులు పీడీ కామన గణేష్, ముషిణి సత్యనారాయణ, చిక్కాల శ్రీదేవి, సుబ్రహ్మణ్యం, రంకిరెడ్డి వీరసత్యనారాయణ, కొప్పిశెట్టి రమణ దంపతులు హాజరయ్యారు. వీరంతా పూర్వ విద్యార్థులతో కలిసి సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం రూ.40 వేలను ఫిక్స్ డిపాజిట్ చేసి అందించారు. పూర్వ విద్యార్థులైన నల్లా వెంకటేశ్వరరావు, తాళ్లపూడి ఎస్సై కట్టా వెంకటరమణ, ఉపాధ్యాయుడు అల్లాడ రవి, మట్టపర్తి శ్రీనివాసరావు, రాయుడు శ్రీనివాసరావు, అరిగెల వరకుమార్, పాలగుమ్మి శ్రీరామ్, బొక్కా రత్నశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసుల ఎత్తివేతపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే పొన్నాడను సత్కరిస్తున్న బాధితులు, నాయకులు

ముమ్మిడివరం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలెంలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన సందర్భంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు సంబంధించిన కేసులను తాజాగా ప్రభుత్వం ఎత్తివేయడంపై ఆయా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కేసుల వివరాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, కేసులు ఎత్తివేయడంలో సహకరించిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ముమ్మిడివరం కార్యాలయంలో ఎమ్మెల్యే పొన్నాడను దళిత సంఘాల నాయకులు, మహిళలు కలిసి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఐ.పోలవరం మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, కాశి బాలమునికుమారి, ఐ.పోలవరం ఎంపీపీ మిరియాం జ్యోతి, డిల్లీనారాయణ, మోకా రవికుమార్, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, పెయ్యల చిట్టిబాబు, కాశి పరివాజ్‌కుమార్, కాశి రామకృష్ణ పాల్గొన్నారు.

### యువత క్రీడల్లో రాణించాలి

అల్లవరం: చదువుతో పాటు యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఎంట్రుకోనలో సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మంగళవారం ప్రారంభించారు. క్రీడల అనంతరం ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

### విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థికి ట్యాబ్‌ని అందిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన ట్యాబ్‌లను ఎంపీ చింతా అనురాధ మంగళవారం అందించారు. గోడితిప్ప ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ అనురాధ మాట్లాడుతూ విద్యా రంగాన్ని అగ్రస్థానంలో ఉంచేందుకు అమ్మ ఒడి, నాడు నేడు, జగనన్న విద్యా కానుక, ఇంగ్లిష్ మీడియం, గోరుముద్ద, బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ తదితర పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నల్లి నివారణకు మందుల పంపిణీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముమ్మిడివరం: సమగ్ర సస్యరక్షణలో భాగంగా కొబ్బరి చెట్ల ఆకులపై నల్లి పురుగు నివారణ కోసం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు మందులు పంపిణీ చేశారు. కొత్తలంక ఎస్సీ సొసైటీ భూముల్లో కొబ్బరి సాగు చేస్తున్న రైతులకు మంగళవారం పసుపు రంగు టార్పాలిన్, బదనికలు, వేప నూనె, బకెట్లు పంపిణీ చేశారు. వాటిని కొబ్బరి చెట్లకు ఏలా ఉపయోగించాలో క్షేత్ర స్థాయిలో అధికారులు వివరించారు. పసుపు రంగు టార్పాలిన్‌కు ఆముదం పూసి, చెట్టుకు ఐదడుగుల ఎత్తులో ఏర్పాటు చేయాలన్నారు. బదనికలు తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉన్న చోట బాటిల్ కట్టాలన్నారు. వేప నూనెను, కొబ్బరి నూనెను చిన్న కొబ్బరి మొక్కలకు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ క్షేత్రస్థాయి అధికారి బాబాయ్, ఎస్సీ సొసైటీ రైతులు మట్టా రామారావు, కాశి నానాజీ, మోర్త వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ఘనంగా ముగిసింది. మంగళవారం పటవల పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీడీఓ ఎం.అనుపమ మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజలందరికీ తెలియజేయడంతో పాటు, ఆయా పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాయుడు గంగాధర్, తణుకు సత్యన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి జేవీ రమణమ్మ, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఎంఈఓ మోకా ఉమ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ అన్నపూర్ణ, వికసిత్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్ గాంధీ, కొపనాతి దత్తాత్రేయ వర్మ తదితరులు పాల్గొన్నారు.

### 500 మందికి కళ్లజోళ్ల అందజేత



కళ్లజోళ్లు అందజేస్తున్న సత్తిబాబు తదితరులు

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్ష తొలి విడతలో నేత్ర పరీక్షలు చేయించుకున్న 500 మందికి మంగళవారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 17 పంచాయతీలకు చెందిన వీరికి కళ్లజోళ్లను ప్రభుత్వం ఉచితంగా అందజేసినట్టు నేత్ర వైద్య నిపుణుడు శీరం సత్తిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ 62 ఏళ్లకు పొడిగించాలి



రామారావుని కలిసిన మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులు

అల్లవరం: డీఎస్సీ–1998 అభ్యర్థులైన మినిమం టైం స్కేల్ బేసిక్‌పై విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణను 62 ఏళ్లకి పొడిగించాలని కోరుతూ ఏపీ అగ్రిమిషన్ సభ్యుడు జున్నూరి రామారావుకు మంగళవారం వారు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, తమకు న్యాయం చేయాలని వారు కోరారు. పాతికేళ్ల తర్వాత తమకు ఉద్యోగాలు రావడం ఆనందంగా ఉన్నా, జాప్యం కారణంగా తీవ్రంగా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, డీఎస్సీ–1998లో మిగిలిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం రామారావును శాలువాతో సత్కరించారు. మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్, కోటిపల్లి రాంబాబు, పి.సత్యనారాయణ, ఎస్.మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతా : సర్పంచ్

అల్లవరం: తాను వైఎస్సార్ సీపీని వీడుతున్నానని ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమని సర్పంచ్ రాయుడు విష్ణు అన్నారు. వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమానికి మంగళవారం అల్లవరం విచ్చేసిన మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ సమక్షంలో విష్ణు విలేకర్లతో మాట్లాడారు. గతంలో వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించానని, ప్రస్తుతం మొగళ్లమూరు సర్పంచ్‌గా ఉన్నానని తెలిపారు. అమలాపురం వేదికగా సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తాను ఎప్పుడూ మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ వెంటే ఉంటానని స్పష్టం చేశారు.